
నేటితో ముగియనున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే 22: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ఏపీ ఈఏపీ సెట్ గురువారంతో ముగియనుంది. ఈ నెల 16 నుంచి జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల), ఐతం (టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)లో జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. రెండు షిఫ్ట్‌ల్లో కలిపి బుధవారం శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో 457 మంది విద్యార్థులకు 429 మంది హాజరయ్యారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 358కు 340 మంది హాజరయ్యారు.

ఇచ్ఛాపురం.. వైసీపీకి డౌటే!


పిరియా విజయ


బెందాళం అశోక్



- టీడీపీకి కంచుకోటగా నియోజకవర్గం
- గత ఎన్నికల్లోనూ చెక్కుచెదరని ఓటర్లు
- ఈసారీ టీడీపీ అభ్యర్థే గెలుస్తారని బెట్టింగ్‌లు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఇచ్ఛాపురం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. గత ఎన్నికల్లో వైఎస్ జగన్ ఒక్కచాన్స్ హవాలోనూ.. ఇక్కడ సైకిలే దూసుకెళ్లింది. 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత 2019 వరకూ ఈ నియోజకవర్గంలో తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగ్గా.. ఎనిమిది పర్యాయాలు టీడీపీ గెలుపొంది రికార్డు సాధించింది. 2004లో ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. వైసీపీ మాత్రం ఇంతవరకూ బోణీ కొట్టలేదు. ఈసారీ అదే సెంటిమెంట్ కొనసాగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వరుసగా రెండుసార్లు గెలుపొందిన టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్.. హ్యాట్రిక్ సాధిస్తారని కొందరు బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఎలాగైనా ఈసారి ఇచ్ఛాపురంలో గట్టిపోటీ ఇస్తున్నామని వైసీపీ ప్రగల్భాలు పలికినా.. విజయంపై ఆ పార్టీ నేతల్లోనూ సందేహం వ్యక్తమవుతోంది. గెలుస్తామో.. లేదోనన్న గుబులు వారిలో కనిపిస్తోంది.

2019లో 'ఇచ్ఛాపురం'లో పోలైన ఓట్లు..

అభ్యర్థి	పార్టీ	లభించిన ఓట్లు
బెందాళం అశోక్	టీడీపీ	79,992 (46.39%)
పిరియా సాయిరాజ్	వైసీపీ	72,847 (42.25%)
దాసరి రాజు	జనసేన	11,123 (6.45%)
నోటా	నోటా	3,880 (2.25%)
కొల్లి ఈశ్వరరావు	కాంగ్రెస్	2,138 (1.24%)
జన్నాల సూర్యవరప్రసాదరావు	బీజేపీ	1,826 (1.06%)
గణప వనజాక్షి	ఇండిపెండెంట్	617 (0.36%)
	మొత్తం	1,72,423 (69.54%)

● ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే వరుసగా మూడుసార్లు ఎన్నికల్లో టీడీపీకే పట్టం కట్టారు. 2009లో టీడీపీ తరఫున పోటీ చేసిన పిరియా సాయిరాజ్ విజయం సాధించారు. కానీ కొన్నాళ్లకు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014లో వైసీపీ నుంచి నర్తు రామారావు, టీడీపీ నుంచి బెందాళం అశోక్ పోటీ పడ్డారు. 53.95శాతం ఓట్లతో బెందాళం అశోక్ గెలిశారు. 2019లో వైసీపీ నుంచి పిరియా సాయిరాజ్ పోటీచేయగా... టీడీపీ నుంచి మళ్లీ బెందాళం అశోక్ బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో జగన్ ఒక్కచాన్స్ కారణంగా ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలకుగానూ 8చోట్ల వైసీపీ విజయం సాధించింది. టెక్కలి, ఇచ్ఛాపురంలో మాత్రం టీడీపీ చెక్కు చెదరలేదు. రెండోసారీ అశోక్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పిరియా సాయిరాజ్ సతీమణి, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, టీడీపీ తరఫున మూడోసారి అశోక్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే.. టీడీపీ ప్రాభవం ఉన్నచోట.. వైసీపీ హవా చూపించలేకపోయింది. పోల్‌మేనేజ్‌మెంట్‌లో సైతం వైసీపీ నాయకులు నిధులు వెనకేసుకున్నారు. ఓటర్లకు అరకొరగానే నగదు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని వైసీపీ ఖాతాలో వేసుకునేందుకు సీఎం జగన్ కూడా ప్రణాళిక వేశారు. కానీ ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేదు. ఇచ్ఛాపురంలో టీడీపీకి తిరుగులేదని.. అశోక్ హ్యాట్రిక్ సాధిస్తారని.. ఎన్డీయే కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై విశ్లేషకులు కూడా స్పష్టం చేస్తున్నారు. కాగా.. వైసీపీ నాయకులు మాత్రం.. తాము గెలుస్తామో.. లేదోనని టెన్షన్ పడుతున్నారు.

● అభివృద్ధిని పక్కనబెట్టి..

ప్రభుత్వం.. రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలి. కానీ గత ఎన్నికల్లో ఇచ్ఛాపురంలో టీడీపీ అభ్యర్థి అశోక్ విజయం సాధించరన్న కారణంతో.. ఈ నియోజకవర్గంలో అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. జల్‌జీవన్‌మిషన్ ఆధ్వర్యంలో సీఎం జగన్.. ఆదరాబాదరాగా కుళాయిలను ప్రారంభించి.. మమ అనిపించేశారు. కొద్దిరోజులకే కుళాయిల పనితీరు కూడా ఆర్భాటంగానే మిగిలిపోయింది. ఇక టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎన్టీఆర్ సుజలధార వంటి పథకాల నిర్వహణను కూడా పట్టించుకోలేదు. ఈ నియోజకవర్గంలోనూ అత్యధిక కిడ్నీ రోగులున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కిడ్నీ రోగులను ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించింది. ఉచితంగా మందులను కూడా అందజేసింది. డయాలసిస్ సెంటర్లను సైతం ఏర్పాటు చేసింది. సీకేడీ రోగులకు పెన్షన్లు కూడా ఇచ్చింది. 2018లో తితలీ తుఫాన్ సమయంలో చంద్రబాబు సీఎంగా ఈ జిల్లాలోనే ఉంటూ పనులను పర్యవేక్షించి బాధితులకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆ అభిమానం ఇక్కడి ప్రజల్లో బలంగా ఉంది. పొత్తులో భాగంగా జనసేన కూడా టీడీపీకి కలిసిరావడంతో.. అగ్నికి వాయువు తోడైనట్టు కూటమి బలం మరింత పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్లు ఈ నియోజక వర్గ అభివృద్ధిని విస్మరించడంతో.. వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో మరింత వ్యతిరేకత పెరిగిందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో తమకు ఓటమి తప్పదని కొంతమంది వైసీపీ నాయకులు మదనపడుతున్నారు. బెట్టింగ్‌ల విషయానికొస్తే.. టీడీపీ అభ్యర్థే గెలుపు ఖాయమని.. ఇరుపార్టీలకు చెందిన చోటానాయకులు పందెం వేస్తున్నారని సమాచారం. ఏదిఏమైనా ప్రజాతీర్పు కోసం మరో 12 రోజులు వేచి చూడాల్సిందే.

విత్తన పాట్లు


ప్రైవేట్ డీలర్ల వద్ద అమ్మకాలకు సిద్ధం చేసిన విత్తనాలు

- నోటిఫైడ్ రకాల పంపిణీకి సిద్ధం
- కిలోకు పది రూపాయలు సబ్సిడీ
- రీచెర్చ్ వెరైటీలపై రైతుల ఆసక్తి

(టెక్కలి)

ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వరి విత్తనపాట్లు తప్పడం లేదు. వ్యవసాయశాఖ రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ చేపడుతున్నా.. తమ సాగుకు అనుకూలమైనవి ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయశాఖ నోటిఫైడ్ రకాలకు చెందిన పలు రకాల విత్తనాలను మాత్రమే కిలోకు రూ.పది సబ్సిడీతో అందిస్తుంది. రైతులు కనక్‌ప్లస్, నూజివీడు సంపద, తరంగిణి, సుభద్ర, అమూల్య, రాణి, ధరణి తదితర రీచెర్చ్ రకాల విత్తనాల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 4.37లక్షల ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్టు అధికారుల అంచనా. ఈ మేరకు జిల్లాకు 1.21లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. రైతులు 40వేల క్వింటాళ్ల వరకూ సొంతంగా విత్తనాలు తయారు చేసుకుంటారు. జిల్లాకు చెందిన ప్రైవేట్ డీలర్లు 40వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలుచేసి రీచెర్చ్ వెరైటీ విత్తనాలు విక్రయిస్తున్నారు. ఇక వ్యవసాయశాఖ ద్వారా సుమారు 40వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం. కాగా.. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో విక్రయాల దృష్ట్యా ఈసారి 36వేల క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయశాఖ రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి సిద్ధం చేస్తోంది.

● ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ఈ ఏడాది ఎంటీయూ 7029(స్వర్ణ) రకం మూడువేల క్వింటాళ్లు, ఎంటీయూ1061 ఏడువేల క్వింటాళ్లు, ఎంటీయూ1064 రకం 2,500 క్వింటాళ్లు, బీపీటీ 5204 (సాంబమసూరి) ఐదువేల క్వింటాళ్ల విత్తనాలు కిలో రూ.10 సబ్సిడీపై అందజేయనుంది. అలాగే ఎంటీయూ1121(శ్రీధుతి) ఆరువేల క్వింటాళ్లు, బీపీటీ 3290 (సోనామసూరి) 600 క్వింటాళ్లు, ఆర్‌జేఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) రెండువేల క్వింటాళ్లు, ఎంటీయూ 1224 (మార్టేరుసాంబ) 1,500 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం 700 క్వింటాళ్లు వరకు తదితర నోటిఫైడ్ రకాల విత్తనాలను కూడా సబ్సిడీపై పంపిణీ చేయనుంది.

● ప్రైవేట్ డీలర్లు మాత్రం తెలంగాణలోని జగిత్యాల హుజరాబాద్, వరంగల్, సిద్ధిపేట, ఖరీంనగర్ ప్రాంతాల నుంచి ఓపీ రకం వెరైటీ విత్తనాలు తెచ్చారు. విజయవాడ సమీపాన విజయరాయి ప్రాంతం నుంచి నూజివీడు సంపద, కనక్‌ప్లస్, పూర్ణిమ, సుభద్ర విత్తనాలను అందుబాటులో ఉంచారు. విశాఖ సమీపాన వడ్డాది నుంచి తరంగిణి, ధరణి, అమూల్య రకాలతోపాటు తెలంగాణ ప్రాంతం నుంచి అమూల్యగోల్డ్, రాణి వంటి రకాల విత్తనాలు తెచ్చి రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేశారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలించకపోవడంతో సుమారు పదివేల హెక్టార్లు వరకు వరినాట్లు జరగని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వర్షాలు అడపాదడపా కురుస్తుండడంతో రైతులు దుక్కిలు దున్ని.. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కానీ, విత్తనాలు ఎంతమేరకు సమకూరుతాయనేవి ప్రశ్నార్థకమవుతోంది.

36 వేల క్వింటాళ్లు సిద్ధం..

జిల్లాలో రైతులకు అవసరమయ్యే 36వేల క్వింటాళ్ల వరి విత్తనాలను ఇప్పటికే సిద్ధం చేశాం. రైతుభరోసా కేంద్రాల ద్వారా వీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

-శ్రీధర్, వ్యవసాయశాఖ జేడీ

ఖరీఫ్ ఆలస్యమే



● రైతుభరోసా కేంద్రాలకు చేరని విత్తనాలు

(మెళియాపుట్టి)

ఖరీఫ్ సాగు ఈ ఏడాది ఆలస్యంగా ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సాగుకు రైతులు సిద్ధమవుతుండగా.. ఇంకా విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు చేరలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం విత్తనాల పంపిణీపై దృష్టి సారించలేదు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు తర్వాత విత్తనాలను రైతుభరోసా కేంద్రాలకు తీసుకువచ్చి.. పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 4.37 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్టు వ్యవసాయాధికారుల అంచనా. దీనికి అనుగుణంగా జిల్లాలో 656 రైతుభరోసా కేంద్రాల ద్వారా సుమారు 40వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయాల్సి ఉంది. ఏటా భూములకు అనుగుణంగా రైతులు విత్తనాలు ఎంపిక చేసుకుంటారు. 7029 స్వర్ణ, 5204 సాంబమసూరి, 1315, 145 రోజులు పంట, 2537 శ్రీకాకుళం సన్నాలు, 3291 సోనామసూరి, 1210 సుజాత, 1061 ఇంద్రజ, 1010 కాటన్‌దొరతోపాటు వివిధ రకాల వరి విత్తనాలు సాగు చేస్తుంటారు. ఇటీవల అడపాదడపా వర్షాలు కురవడంతో చాలామంది రైతులు జూన్ మొదటి వారంలోనే వెదలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా.. ఇప్పటివరకూ రైతుభరోసా కేంద్రాలకు విత్తనాలు చేరకపోవడంతో.. మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల రైతులు ఒడిశా నుంచి విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. అధికారులు స్పందించి రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ముగియగానే..

రైతులకు ఏ విత్తనాలు అవసరమో రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. విత్తనాలు జిల్లాకు వచ్చాయి. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి అవకాశం ఇచ్చారు. విత్తనాలు వేయటానికి సమయం ఉంది. ఎన్నికల కోడ్ ముగియగానే విత్తనాలు పంపిణీ చేస్తాం.

-ఎల్.మధు, ఏడీఏ, పలాస

సర్టిఫికెట్లు ఎప్పుడిస్తారో?

- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు పాట్లు
- ఎన్నికల విధులతో నిలిచిన జారీ ప్రక్రియ
- విద్యార్థుల ఆవేదన

(ఇచ్ఛాపురం)



ఉన్నత చదువులు అభ్యసించేందుకు విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీ చాలా జాప్యమవుతోంది. సార్వత్రిక పోరు షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచీ.. జిల్లాలోని అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సర్టిఫికెట్ల కోసం ఎదురుచూస్తున్నారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయినా వెబ్‌సైట్‌లు తెరుచుకోవడం లేదని వాపోతున్నారు. నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల అవసరం పెరిగింది. నూటికి 80 శాతం విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆయా విద్యాసంస్థల్లో చేరేందుకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం ఉంటుంది. ఈ మేరకు విద్యార్థులు మీసేవ, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నా.. సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్లు వేగంగా అయిపోతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఏమిచేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఆయా యాజమాన్యాలకు కొద్దిరోజులు గడువు అడుగుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా ధ్రువపత్రాలు జారీచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి వద్ద ప్రస్తావించగా.. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య కారణంగా సర్టిఫికెట్లు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం చాలామంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని, పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా రెండు రోజుల్లో జారీ చేస్తామని తెలిపారు.

రేపటి నుంచి 'పది' అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ

గుజరాతీపేట, మే 22: పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశామని డీఈవో వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. 'జిల్లాలో 9 కేంద్రాల్లో సుమారు 2,100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తాం. ఈ పరీక్షలు వచ్చేనెల ఒకటి నుంచి 8 వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాల'ని డీఈవో వెంకటేశ్వరరావు సూచించారు.

అసలు ఏం జరిగింది?

- రుణాల వ్యవహారంలో బ్యాంకు సిబ్బంది గోప్యత
- మూడు రోజుల కిందట కొత్త బీఎం నియామకం

నరసన్నపేట, మే 22: నరసన్నపేటలోని ఓ బ్యాంకులో రుణాల మంజూరు వ్యవహారంలో నిజాలు బయటకు పొక్కనీయకుండా సంబంధిత అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్ఎంవోను గత నెలలో బదిలీ చేశారు. బ్రాంచ్ మేనేజర్‌ను రీజనల్ కార్యాలయం డిప్యూట్ చేసి.. ఆయన స్థానంలో వీరఘట్టం బ్యాంకులో పనిచేస్తున్న బీఎంను మూడురోజుల కిందట ఇక్కడ నియమించారు. అయితే ఏం జరిగిందన్న విషయాన్ని బయటపెట్టకపోవడం చర్చనీయాంశమవుతోంది. నరసన్నపేటలోని బ్యాంకులో ఏడాదిన్నర కిందట ఉద్యోగులు వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమయంలో కొందరి డాక్యుమెంట్లు ఆధారంగా బ్యాంకు సిబ్బందే బినామీ ఖాతాలు తెరిచి.. రుణాలను పొందినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై గత నెలలో పత్రికల్లో కథనాలు వచ్చాయి. గతంలో పనిచేసిన ఓ అధికారి ఈ తతంగమంతా నడిపించినట్టు శాఖాపరంగా గుర్తించిన బ్యాంకు ఉన్నతాధికారులు ఆయనను వేరుజిల్లాకు బదిలీ చేశారని తెలుస్తోంది. అలాగే రుణాల మంజూరు వ్యవహారంపై గత నెలలో దర్యాప్తు చేసిన విజిలెన్స్ నివేదిక బయటకు పొక్కకుండా చేస్తున్నారు. రుణాల వ్యవహారంలో పాత మేనేజర్‌ను పావుగా వాడుకుని.. కొంతమేర డబ్బులు పక్కదారి పట్టాయని గుర్తించినట్లు సమాచారం. కాగా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన వారిని పక్కన పెట్టారని.. అయితే సాధారణ బదిలీలు మాత్రమేనని అధికారులు చెప్పుకొస్తుండడం గమనార్హం. బ్యాంకులో పెద్ద ఎత్తున అవకతవకలు జరగడంతోనే.. కొంతమంది అధికారులను బదిలీల పేరుతో పంపిస్తున్నారనేది చర్చనీయాంశమవుతోంది. ఖాతాదారులకు నష్టం వాటిల్లకుండా.. బినామీ పేర్లతోనే రుణాల మంజూరు జరగడంతో.. బ్యాంకు ఉన్నతాధికారులు శాఖాపరంగా చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది.

ఇంటర్ సీట్లకు తీవ్ర పోటీ

- మూడు రెసిడెన్షియల్ కళాశాలల్లో భర్తీకి కౌన్సిలింగ్
- కొందరికే దక్కిన సీట్లు
- పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంపై విద్యార్థుల్లో నిరాశ

సీతంపేట, మే 22: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న పెద్దమడి బాలురు, సీతంపేట బాలికలు, బాలురు గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. స్థానిక బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో జరిగిన ఈ కౌన్సిలింగ్‌కు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ఈ మూడు రెసిడెన్షియల్ కళాశాలల్లో 430 సీట్లు ఉండగా.. మొత్తం 1,181 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. వీరిలో 1150 మంది విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. అయితే జిల్లాలో ఏకైక బాలికల రెసిడెన్షియల్ కళాశాల సీతంపేటలో ఉంది. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 635మంది విద్యార్థినులు దరఖాస్తులు చేసుకొని కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. దీంతో సీటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. పదో తరగతిలో 530 మార్కులకు పైబడి వచ్చిన విద్యార్థినులకు ఇక్కడ సీటు లభించింది. దీంతో చాలామంది బాలికలకు సీటు లభించక నిరాశ చెందారు. పెద్దమడి బాలురు కళాశాలకు సంబంధించిన కౌన్సిలింగ్ కూడా సీతంపేటలోనే నిర్వహించారు. ఇక్కడ కూడా తీవ్ర పోటీ ఉండడంతో సీట్లు లభించలేదు. చాలా మంది విద్యార్థులు 100 కిలోమీటర్లు దూరం నుంచి కౌన్సిలింగ్ హాజరుకావడం, వారికి కళాశాలలో సీట్లు లభించకపోవడంతో తీవ్ర ఆవేదన చెందారు. గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నప్పటికీ కళాశాలల్లో సీట్లు పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంతో వారు చదువుకు దూరమై డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్నారు. కౌన్సిలింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, సీతంపేట పెద్దమడి ప్రిన్సిపాల్ పి.వి.రామారావు, సూర్యకుమారి, గురుకుల సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి.. ఒక్కటే లిఫ్ట్

జీజీహెచ్‌లో రోగులకు తప్పని ఇబ్బందులు

(శ్రీకాకుళం అర్బన్)

జిల్లాకే పెద్దాసుపత్రి. వెయ్యి పడకలు. జిల్లా నలుమూలల నుంచి రోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. ఆర్థికస్థోమత లేక.. ప్రైవేటు ఆస్పత్రులు వెళ్లలేక.. ఈ ఆస్పత్రే తమకు దిక్కని భావిస్తారు. కానీ.. ఇక్కడ వచ్చే రోగులకు మాత్రం అరకొర సౌకర్యాలు అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదీ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్-రిమ్స్)లో తీరు. ఇక్కడ పేరుకు వెయ్యి పడకలున్నా.. ఒకే ఒక్క లిఫ్ట్ ఉండడంతో రోగులు నరకయాతన పడుతున్నారు. నాలుగు అంతస్థుల్లో సేవలందించే వార్డులు ఉన్నాయి. ఆ వార్డులకు చేరుకునేందుకు గతంలో మూడు లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. కాగా రెండేళ్ల నుంచి ఒకటి, గతేడాది నుంచి మరొక లిఫ్ట్ పనిచేయడం లేదు. అయినా రిమ్స్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఒక్కటే లిఫ్ట్ పనిచేస్తోంది. రోగులకు, వైద్యులకు ఇదొక్క లిఫ్ట్ ఆధారంగా మారింది. దీంతో కొన్నిసార్లు అత్యవసర సమయాల్లో లిఫ్ట్ అందుబాటులో లేకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రిమ్స్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఓ కమిటీని నియమించినా.. ప్రయోజనం లేకపోతోందని పలువురు వాపోతున్నారు. కలెక్టర్, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై రిమ్స్ ఉన్నతాధికారులను వివరణ కోరగా నిర్వహణ నిధులు లేవని, పై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని తెలిపారు.


రిమ్స్‌లో లిఫ్ట్ కోసం బాధితుడితో ఎదురు చూస్తున్న సిబ్బంది



కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడి' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడి'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ "కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.

ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే




ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'గేమ్ ఛేంజర్', 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.



లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా
- ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.
- ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.
- దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.
- ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

పారిపోయే పిరికిదాన్ని కాదు



నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కల్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

● పోలీసులకు ఆర్డీఓ భరత్ నాయక్ ఆదేశం

పలాస, మే 22: వచ్చేనెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అలజడులు లేకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పలాస ఎన్నికల అధికారి, ఆర్డీఓ భరత్‌నాయక్ పోలీసులను కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో పలాస నియోజకవర్గంలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల హౌస్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక గ్రామాల్లో ఇరుపార్టీల మధ్య సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టింగులు పెట్టుకుంటున్నారని.. ఫలితాల అనంతరం కొద్ది రోజుల పాటు సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ ఎన్నికల సందర్భంగా ఎంతమందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు? ఎన్ని కేసులు నమోదయ్యాయన్న విషయాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని, కొత్త వ్యక్తులు వస్తే తక్షణం వారి వివరాలు సేకరించాలన్నారు. కౌంటింగ్ రోజు గ్రామాల్లో ఎటువంటి హింసాత్మక సంఘటనలు జరగడానికి వీలులేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించచారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ కె.విజయానంద్, ఎస్ఐలు పారినాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.


పోలీసులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్


ఈదులవలసలో కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


టెక్కలిలో ...

అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

కొనసాగిన కార్డెన్‌సెర్చ్

పోలాకి: ఈదులవలస గ్రామంలో బుధవారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. సీఐ ప్రసాదరావు, ఎస్ఐ సత్యనారాయణ, జలుమూరు, సారవకోట మండలాల పోలీస్ సిబ్బంది వచ్చి ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనధికార వాహనాలు, మద్యం, బాణసంచా సామగ్రి నిల్వలపై సోదాలు చేశారు. గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామ శివారులోని పూరిగుడిసెలు, పశువుల శాలలు, షెడ్డులను పరిశీలించారు. మామిడి తోటల్లో మద్యం నిల్వలు ఉంటాయన్న సమాచారం మేరకు పరిశీలించారు. రాత్రి, పగలు పోలీసుల నిఘా ఉంటుందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు హఠాత్తుగా తనిఖీలు చేపట్టడంతో ప్రజలు భయాందోళన చెందారు.

సోగ్గాడిపేటలో..


టెక్కలి: మేజర్ పంచాయతీ టెక్కలి సోగ్గాడిపేటలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో నివశిస్తున్న వారి ఆధార్ కార్డులు, వాహనాల పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని నాలుగు వాహనాలను ఎస్ఐ లక్ష్మి సీజ్ చేశారు.

జయరామచంద్రపురంలో..

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు జయరామచంద్రపురం గ్రామంలో బుధవారం ఉదయం కాశీబుగ్గ పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వ హించారు. ఎటువంటి పత్రాలు లేని మొత్తం నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల వేళ ఈ గ్రామంలో చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకోవడంతో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు లేకుండా ముందస్తుగా పోలీసులు సమస్యాత్మక గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. ఎస్ఐ పారినాయుడు ఆధ్వర్యంలో సోదాలు జరిగాయి.

కుంటిభద్రలో..

కొత్తూరు: కుంటిభద్ర గ్రామంలో బుధవారం వేకువజామున సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతి వీధిని, కల్లాలను, తోటలను విస్తృతంగా జల్లెడ పట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఎస్ఐ అహ్మద్, హిరమండలం ఎస్ఐ నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.


జేఆర్‌సీ పురంలో వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు


కొత్తూరు: కుంటిభద్రలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ

ఘనంగా నరసింహ స్వామి జయంతి

మందస: మందసలో నరసింహ స్వామి జయంత్యుత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, అన్నదానం నిర్వహించినట్లు అర్చకులు పరేష్ త్రిపాఠి తెలిపారు.

శాంతియుత వాతావరణం అవసరం

పోలాకి: ఓట్ల లెక్కింపు ముందు, తర్వాత ప్రజాప్రతినిధులు, ప్రజలు గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొనడానికి సహకరించాలని సీఐ పి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం పోలాకి పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపు ఓటములపై పందాలు కాయవద్దన్నారు. రెచ్చగొట్టే విధంగా మాట్లాడరాదన్నారు. జూన్ 4వ తేదీ వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు గడువు సమీపిస్తున్నందున సమస్యాత్మక గ్రామాల్లో శాంతియుత వాతావరణం కల్పించాలని కోరారు. పెట్రోల్ బంక్‌ల్లో సీసాలతో లూజు పెట్రోల్ ఇవ్వరాదని నోటీసులు అతికించామన్నారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే తమకు తెలియచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతతకు సహకరించాలి

టెక్కలి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు సహకరించాలని సీఐ పి.షైడయ్య అన్నారు. బుధవారం రాత్రి చాకిపల్లి, పెద్దసాన, పోలవరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల సమస్య ఎక్కడ తలెత్తినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ పార్టీల వారు పోలీసుల అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలూ చేపట్టరాదని సూచించారు. ఆయనతో పాటు పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆది ఆంధ్రా వీధిలో తాగునీటి కష్టాలు

టెక్కలి: మేజర్ పంచాయతీ ఆది ఆంధ్రా వీధిలో 570 నివాసాలకు తాగునీరు అందడం లేదని స్థానికులు పినిమింటి యర్రయ్య, తోట రాజశేఖర్, చిరంజీవిలు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఆదిఆంధ్రా వీధి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతానికి తాగునీరు సరఫరాకు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఉపాధి పనులను పరిశీలించాలి

నరసన్నపేట: గ్రామాల్లో చేపడుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను సాంకేతిక సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పరిశీలించాలని డుమా పీడీ చిట్టిరాజు సూచిం చారు. బుధవారం స్థానిక డుమా కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. పనులు జరిగే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోతే చర్యలు తీసుకోవాలన్నారు. మేట్‌లకు తగిన మార్గదర్శకాలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను బడిలో చేర్పించండి

జలుమూరు (సారవకోట): బడి బయట ఉన్న దివ్యాంగులైన చిన్నారులను గుర్తించి సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు ఎం.వి.రమణ, భూలక్ష్మి సూచించారు. సారవకోటలో ఇంటింటా నిర్వహిస్తున్న దివ్యాంగ పిల్లల సర్వేను బుధవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో సహిత విద్య ఉపాధ్యాయులు సంధ్య, పూర్ణిమ పాల్గొన్నారు.

చాపరలో పనిచేయని ఏటీఎం

మెళియాపుట్టి: చాపరలో గల ఎస్‌బీఐ ఏటీఎం గత కొంత కాలంగా పనిచేయకపోవటంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఎస్‌బీఐ ఏటీఎం తప్ప మిగతా బ్యాంకులకు సంబంధించినవి లేవు. దీంతో నగదు కోసం ఒడిశాలోని పర్లాఖిముండికి వెళుతున్నట్టు ఖాతాదారులు చెబుతున్నారు. బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎంకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రికార్డుల నిర్వహణపై అప్రమత్తం

పాతపట్నం: రికార్డుల నిర్వహణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి డా.మంచు కరుణాకరరావు అన్నారు. తిడ్డిమి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరి విత్తనాలు రైతు లందరికీ అందేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ సహాయకులకు సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు సరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పాపారావు, సిబ్బంది ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న కరుణాకరరావు

మజ్జి గౌరమ్మకు ముర్రాటలు

రోటరీనగర్ (ఎల్.ఎన్.పేట), మే 22: లక్ష్మీనర్సుపేట గ్రామంలో వెలసిన బంగారు సంతోషిమాత మహోత్సవాల్లో భాగంగా రోటరీ నగర్‌లోని మజ్జిగౌరమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలంతా సామూహికంగా ముర్రాటలు చెల్లించి.. మొక్కులు తీర్చుకున్నారు.


మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. హనుమంతు వాహనంపై శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు నరసన్నపేట పట్టణానికి రావడంతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పూజలు చేశారు. తిరువీధుల్లో మహిళల కోలాటం, కూచిపూడి, తప్పెటగుళ్ల ప్రదర్శనలతో పాటు స్వామివారి ముందు గజ, అశ్వ, ఒంటెలను ఊరేగించారు.


హనుమంతుని వాహనంపై వేంకటేశ్వర స్వామి

27న మండల పరిషత్ సమావేశం

పోలాకి: మండల పరిషత్ సాధారణ సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఉషశ్రీ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10 గంటలకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందించనున్నట్టు వ్యవసాయాధికారి పి.లతాశ్రీ తెలిపారు. కట్టెజనుము ప్రభుత్వ ధర కిలో రూ.88 కాగా, సబ్సిడీపై రూ.44, పిల్లిపెసర కిలో రూ.134 కాగా, సబ్సిడీపై రూ.67కు, జీలుగ రూ.88 కాగా రూ.44 కు ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. వీటన్నింటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తామన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం

నందిగాం: తెలుగు వెలుగు సాహితీ వేదిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ పురస్కారానికి ఎంపికైన నరేంద్రపురం మాజీ సర్పంచ్, టీడీపీ సాంస్కృతిక విభాగ పార్లమెంటరీ ప్రతినిధి జీరు మోహనరావుకు తెలుగుదేశం శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఒంగోలులో ఆదివారం పురస్కారం పొందడంతో నందిగాం పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మోహనరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జాతీయ పురస్కారం పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. సన్మాన గ్రహీత మోహనరావు మాట్లాడుతూ ఈ అవార్డు పార్టీ సాంస్కృతిక విభాగానికి బహూకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్ ఎం.బాలకృష్ణ, కె.ప్రసాదరావు, ఎస్.జానకిరాం, టి.మహేష్, టి.చిరంజీవి, కె.ధర్మారావు, ఎం.సింహాచలం, గిరిబాబు, ఎస్.నాగరాజు, టి.సింహాద్రినాయుడు, ఎం.మోహనరావు, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ పురస్కార గ్రహీత జీరు మోహనరావును సత్కరిస్తున్న తెలుగుదేశం నాయకులు

ఘనంగా గౌతు జన్మదిన వేడుకలు

పలాస: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గౌతు శ్యామసుందర శివాజీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. పలాస పరిశీలకుడు చౌదరి బాబ్జీ.. శివాజీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, శంకర్, యవ్వారి మోహనరావు, వి.మాధవరావు, జోగ మల్లి, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

నందిగాం: నందిగాం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి వారికి చైతన్యం నింపారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు.

కూలిపోయిన కల్వర్టు

గొల్లలవలస (పోలాకి): గొల్లలవలస నుంచి డోల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిగా కూలిపోయింది.. ఈ కారణంగా వాహనదారులు అటువైపు నుంచి వెళ్లరాదని గ్రామస్తులు అలెర్ట్ చేశారు. రహదారి మీదుగా వెళ్లకుండా అడ్డంగా రాళ్లుపెట్టి దారి మళ్లిస్తున్నారు. వెంటనే కల్వర్టు నిర్మించకుంటే దీర్ఘాశి, సంతలక్ష్మీపురం, గొల్లలవలస, డోల, పోలాకి గ్రామాలకు వెళ్లేందుకు మార్గం ఉండదని గ్రామస్థులు తెలిపారు. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు విషయమై ఇంజనీరింగ్ అధికారులకు, సచివాలయ సిబ్బందికి తెలియజేశామని సర్పంచ్ ప్రతినిధి జగన్మోహనరావు తెలిపారు.


గొల్లలవలస, డోల రహదారి మధ్య కూలిపోయిన కల్వర్టు

రసాభాసగా మండల సమావేశం

కొత్తూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సభ మొదలైన పది నిమిషాలకే ముగిసింది. ఎంపీపీ సవర సావిత్రి ఆధ్వర్యంలో సభ ప్రారంభమైంది. మండల ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్ వేదిక పైకి సభ్యులను ఆహ్వానిస్తున్న సమయంలోనే పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ కూడా ఆహ్వానించారు. పీఏసీఎస్ చైర్మన్‌కు మండల సమావేశంలో వేదికపై కూర్చోవడానికి ప్రొటోకాల్ లేదంటూ టీడీపీ ఎంపీటీసీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో మాటల యుద్ధానికి తెరలేచింది. వాదోపవాదాల అనంతరం రసాభాసగా మారడంతో సమాచారం అందుకున్న కొత్తూరు ఎస్ఐ అహ్మద్ చేరుకొని పరిస్థితిని సరిదిద్దారు. ఈ సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు అగతముడి బైరాగినాయుడు, చీకటి వీర్రాజు, వడ్డి గౌరి, సర్పంచ్‌లు నాగళ్ల అప్పన్న, కొయిలాపు శ్రీను, అదపాకల శంకరరావు, సాదు బాబు, బోర సింహాద్రినాయుడు, సిమ్మ మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో..

- అందుకోవాలని ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ముందుకు..
- ఓవర్ టేక్ చేస్తూ అదుపు తప్పిన బైక్
- అదే బస్సు కింద పడి మహిళ మృతి


అప్పలనర్సమ్మ మృతదేహం

పాతపట్నం/మెళియాపుట్టి: తనను గమ్యస్థానానికి చేర్చాల్సిన బస్సే.. ఓ మహిళకు యమపాశమైంది. ఆర్టీసీ బస్సు ఆపక పోవడంతో ఓ ద్విచక్ర వాహనంతో వెంబడించి... దాన్ని అందుకునే క్రమంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన పాతపట్నం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మెళియాపుట్టి మండలం తూముకొండ రామచంద్ర పురం గ్రామానికి చెందిన తోట అప్పలనరసమ్మ(45) తన కన్నవారి గ్రామం పాతపట్నం మండలం చిట్టి జగన్నాథపురంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆ గ్రామ జంక్షన్‌లో బస్సు కోసం వేచి ఉంది. ఈ క్రమంలో టెక్కలి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించింది. ఆ బస్సును ఆపకపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై ఆమెను ఎక్కించుకొని... అదే బస్సును అందుకునే ప్రయత్నం చేశాడు. పాతపట్నం మండలం ద్వారాకాపురం వద్ద ఆ బస్సును దాటుతున్న క్రమంలో బైక్ అదుపు తప్పింది. వాహనంపై కూర్చున్న అప్పలనరసమ్మ అదే బస్సు వెనుక చక్రాల కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అప్పలనర్సమ్మ భర్త కాంతారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహ్మద్ యాసిన్ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె


తండ్రి అంత్యక్రియల్లో కుమార్తె రవళి

పాతపట్నం: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. రౌతు లక్ష్మీపురం గ్రామానికి చెందిన తూలుగు రామారావు(65) బుధవారం వృద్ధాప్య సమస్యలతో చెనిపోయారు. అతనికి కుమార్తె రవళి ఒక్కరే సంతానం. దీంతో ఆమె తలకొరివిపెట్టి కర్మకాండలు నెరవేర్చి అంత్యక్రియలు పూర్తి చేసింది. కాగా రామారావుకు భార్య భారతమ్మ ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- డ్రైవర్ మృతి

టెక్కలి: జాతీయ రహదారి ఆదీఆంధ్రా వీధి సమీపంలో ఆగి ఉన్న ఓ గ్రానైట్ లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో వెనుక లారీలో ఉన్న డ్రైవర్ మృతి చెందాడు. క్యాబిన్‌లో డ్రైవర్ మృతదేహం ఇరుక్కుపోవడంతో సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్రెయిన్ సహాయంతో బయటకు తీశారు. మృతుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి బీఆర్ నగర్ సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు బుధవారం ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఇతడు మానసిక వ్యాధిగ్రస్తుడిగా ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్టు స్థానికుల ద్వారా గుర్తించామన్నారు. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో భద్రపరచినట్టు తెలిపారు. ఇతడి వివరాలు తెలిసినవారు ఆమదాలవలస సీఐ 63099 90823, ఎస్ఐ 63099 90854 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ఇచ్ఛాపురం: డొంకూరు గ్రామానికి చెందిన వివాహిత వాసుపల్లి ఉష(30) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఉష చాలా కాలం నుంచి తీవ్ర తల నొప్పితో (మైగ్రేన్) తో బాధపడుతుంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తీవ్ర తలనొప్పి రావడంతో భర్త రామారావుకు చెప్పింది. ఉదయం ఆసుపత్రికి తీసుకెళ్తానని చెప్పడంతో నిద్రపోయింది. బుధవారం వేకువ జామున భర్త బయటకు వెళ్లాడు. అదే సమయంలో తలనొప్పి తీవ్రంగా రావడంతో తట్టుకోలేక ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లిన భర్త ఇంటికి వచ్చి చూసే సరికి భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

కుమారుడి మృతి తట్టుకోలేక తల్లి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న నిరోషా

టెక్కలి: రావివలస పంచాయతీ చిన్న నారాయణపురం గ్రామానికి చెందిన దాసరి సాయివినీత్ (12) మంగళవారం పాముకాటుకు గురై మృతిచెందాడు. కుమారుడి మరణం తట్టుకోలేక తల్లి దాసరి నిరోషా బుధవారం ఇంట్లో ఉన్న మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైం: ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఆదివారంపేటలో గల రాఘవేంద్ర స్వామి ఆలయం వద్ద నివసిస్తున్న బంకు సూర్యనారాయణరావు మంగళవారం రాత్రి ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చాడు. ఈ క్రమంలో ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు గాయపడగా, చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

మూడు రోజుల పాపకు అరుదైన వెన్నెముక శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స అనంతరం పాపతో ఆసుపత్రి వైద్యులు

అరసవల్లి: కొర్ని గ్రామానికి చెందిన మూడు రోజుల పాపకు శ్రీకాకుళం నగరంలోని గ్లోబల్ న్యూరోకేర్ ఆసుపత్రిలో అరుదైన వెన్నెముక శస్త్ర చికిత్స జరిగింది. పుట్టుకతోనే వెన్నెముక లోపం వల్ల పాప నరాలు బయటకు వచ్చి ఉండటంతో ఆ చిన్నారి ప్రాణాలకు హాని ఉంది. ఈ పరిస్థితిలో డాక్టర్ దేవరెడ్డి గౌతమ్ (న్యూరో సర్జన్), డాక్టర్ గొనప భవాని (అనస్థీషియా) ఆధ్వర్యంలో నాలుగు గంటల శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. కేవలం 2.5 కిలోల బరువు గల మూడు రోజుల వయసు గల పాపకు పూర్తిగా మైక్రోస్కోపిక్ సర్జరీ నిర్వహించారు. ఇటువంటి శస్త్రచికిత్స చాలా అరుదని, విజయవంతంగా పూర్తి చేయడంపై వైద్యులను పలువురు అభినందించారు. ఈ శస్త్ర చికిత్సకు సహకరించిన డాక్టర్ సీపాన రాజేష్, డాక్టర్ రామకోటేశ్వరరావులకు డాక్టర్ గౌతమ్ కృతజ్ఞతలు తెలిపారు.

అడ్డుగా ఉన్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- వివాహేతర సంబంధమే కారణం
- నిద్రమాత్రలు కలిపి, కత్తులతో గొంతు కోయించి..
- భయంతో వీఆర్వో ఎదుట లొంగిపోయిన వైనం
- పరారీలో ప్రియుడు, అతడి స్నేహితుడు
- పారిశుధ్య కార్మికుడి హత్య కేసు ఛేదించిన పోలీసులు


తిరుమల అరెస్టును చూపిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైం, మే 22: నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న ఓ వ్యక్తి విధులు ముగించుకుని భార్య పిల్లలతో సరదాగా గడిపి రాత్రి ఇంటికి చేరుకుని మేడ మీద పడుకున్నాడు. అర్థరాత్రి భార్య లేచి చూసేసరికి కత్తి గాట్లతో రక్తపు మడుగుల్లో భర్త విగతజీవిగా కనిపించిన ఘటన జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన విషయం విదితమే.. ఈ కేసును వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. తన వివాహేతర సంబంధాలకు అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి పథకం ప్రకారం భార్యే హత్య చేయించింది. బుధవారం శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో సీఐ ఎల్.సన్యాసినాయుడు వివరాలను వెల్లడించారు. నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సీర సురేష్‌బాబు (33) 14 ఏళ్ల కిందట తిరుమల అనే మహిళను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో తిరుమల పనిచేస్తుంది. ఈ క్రమంలో అక్కడే వంట మాస్టర్‌గా పనిచేస్తున్న ఒడిసా రాష్ట్ర జాజ్‌పూర్‌కు చెందిన రియాజుద్దీన్ ఖాన్‌తో తిరుమలకు పరిచయం ఏర్పడి, అది కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం భర్త సురేష్‌బాబుకు తెలిసింది. చాలాసార్లు భార్య తిరుమలను హెచ్చరించాడు. దీంతో ఈ ఏడాది జనవరి 2న తిరుమల భర్త, పిల్లలను విడిచి పెట్టి ఇంటి నుంచి పరారైంది. దీంతో సురేష్‌బాబు తన భార్య కనిపించడం లేదని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రియాజుద్దీన్‌ఖాన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు తెలిపాడు. వారం రోజుల తర్వాత ఆమె తిరిగి ఇంటికి వచ్చేసినా ఆమె తీరు మార్చుకోలేదు. దీంతో సురేష్‌బాబు ఓ రోజు రియాజుద్దీన్‌ఖాన్ పని చేస్తున్న హోటల్‌కు వెళ్లి హెచ్చరించాడు. జరిగిన విషయం షాపు యజమానికి తెలియడంతో వారిద్దరిని పనిలోంచి తీసేశారు. దీంతో రియాజుద్దీన్‌ఖాన్ ఆమదాలవలస సమీపంలోని గల ఓ దాబాలో చేరాడు. తిరుమల జీటీ రోడ్డులోని ఓ హోటల్‌లో చేరింది. దీంతో వీరిద్దరు కలుసుకోవడం కష్టంగా మారింది. తమకు సురేష్ అడ్డుగా ఉన్నాడని, ఆ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు.

ప్రియుడితో కలిసి పథకం ప్రకారం..

తన భర్త అడ్డు తొలగించాలనుకున్న తిరుమల అందుకు తమ పెళ్లి రోజును వాడుకోవాలని అనుకుంది. వీరిద్దరికి 14 ఏళ్ల కిందట మే 20న వివాహం జరిగింది. దీంతో తిరుమల తన భర్తతో ప్రేమగా ఉన్నట్టు నటించి, ఈ నెల 16న పెళ్లి రోజుకు బట్టలు తీయాలని, పిల్లలతో సరదాగా గడుపుదామని భర్త సురేష్‌బాబును నమ్మించి సాయంత్రం షాపింగ్ చేయించి, హోటల్‌లో భోజనం చేసి రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇదిలా ఉంటే సురేష్‌బాబుకు నగరంలోని ఓ వీధికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం ఉంది. అదే రోజే రాత్రి 10 గంటల సమయంలో ఆ మహిళలను కలిసేందుకు సురేష్‌బాబు వెళ్లాడు. ఇదే అదునుగా తిరుమల తన ప్రియుడికి వేరేవారి ఫోన్‌తో కాల్ చేసి పథకం ప్రకారం నిద్రమాత్రలు తెప్పించుకుంది. భర్త తిరిగి 11 గంటలకు ఇంటికి వచ్చాడు. దుస్తులు మార్చుకున్న సురేష్‌బాబుకు అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న నిద్రమాత్రలు కలిపిన నీటిని అందించింది. దీన్ని గ్రహించని సురేష్‌బాబు ఆ నీటిని తాగి భార్య పిల్లల కలిసి పడుకుండిపోయాడు. భర్త పూర్తిగా మత్తులోకి జారుకున్న తర్వాత తన ప్రియుడికి సమాచారం అందించింది. అర్థరాత్రి 12.30 గంటల సమయంలో మేడ మీద నుంచి కిందకు వచ్చి ఆమె ప్రియుడుకి, అతని స్నేహితుడు నూరుద్దీన్‌ఖాన్‌లను మేడపైకి తీసుకుని వెళ్లింది. వారిద్దరు తమతో పాటు తెచ్చుకున్న కత్తులతో ఒకరు పీక కోయగా, మరొకరు వీపు పై కత్తితో పొడిచాడు. కదలకుండా సురేష్‌బాబు కాళ్లను తిరుమల పట్టుకుని అతి కిరాతకంగా చంపించింది. హత్య చేసిన తర్వాత రియాజుద్దీన్‌ఖాన్ అతడి స్నేహితుడు నూరుద్దీన్ ఖాన్ తమతో తెచ్చుకున్న కత్తులు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోగా, భార్య తిరుమల ఏమీ ఎరుగనట్టు పిల్లల పక్కన పడుకుంది. సరిగ్గా 1.45 గంటలకు బాత్‌రూమ్‌కు వెళ్లడానికి లేచినట్టు లేచి తన భర్తను ఎవరో చంపేశారంటూ భర్త కుటుంబ సభ్యులకు, స్థానికులకు సమాచారం ఇచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. అతి పాశవికంగా, కిరాతకంగా ఓ మనిషిని పీక కోసి, కత్తులతో పొడిచి చంపేసినా పక్కనే పడుకునా తనకు తెలియదంటూ తిరుమల పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ఇచ్చింది. దీని ఆధారంగా వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్, సీఐ ఎల్‌సన్యాసినాయుడు తిరుమలపై అనుమానంతో కేసును విచారించారు. తనను స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు కొడతారన్న భయంతో గొంటివీధి వీఆర్వో ఇజాజ్‌ఖాన్ ఎదుట లొంగిపోయి, హత్య తానే చేయించినట్టు అంగీకరించింది. దీంతో సీఐ ఎల్ సన్యాసినాయుడు తిరుమలను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ వై.శృతి ఆమెను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. తిరుమలపై ఎస్సీ, ఎస్టీ కేసును సీఐ నమోదు చేశారు. హత్యలో ప్రధాన నిందితుడైన రియాజుద్దీన్‌ఖాన్, అతడికి సహకరించిన నూరుద్దీన్ ఖాన్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.


కొల్లివలస వద్ద చెరువులో గుంపుగా నీరు తాగుతున్న మూగజీవాలు

మూగజీవాలు విల.. విల

భానుడు రోజు రోజు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ప్రజలతో పాటు మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు అధిక స్థాయికి చేరుకుంటున్నాయి. దీనితో ప్రజలంతా ఇంటికే పరిమితం అవుతుండగా.. మేతకోసం బయటకు వెళ్తున్న మూగజీవాలు నీటి కోసం ఇబ్బందిపడుతున్నాయి. మండలంలో సుమారు 220 చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. అక్కడక్కడ నీరు ఉన్న చెరువులే మూగజీవాలకు ఆధారం. ఇందుకు ఈ ఫొటోయే నిదర్శనం. బుధవారం కొల్లివలస సమీపంలో ఉన్న ఓ చెరువు వద్ద గుంపుగా నీరు తాగుతున్న మూగజీవాలు. దీతో మూగజీవాలకు తాగునీటి వెతలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- బూర్జ

కష్టపడ్డారు.. ఫలితం దక్కుతుంది


నడిమివలస గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

జి.సిగడాం: ఎన్డీఏ కూటమి విజయం సాధించేందుకు ప్రతీ ఒక్కరూ తమ వంతుగా కష్టపడ్డారని, అందుకు ఫలితం దక్కుతుందని ఎచ్చెర్ల కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. గడబపాలెంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ దేవత అసిరితల్లి పండగకు బుధవారం హాజరైన ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నడిమివలస గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. భగవంతుడు ఆశీర్వదించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశాన్ని ఇస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఈ రెండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, కలిశెట్టి సూర్యనారాయణ తదితరులు హాజరయ్యారు. నాయకులు కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్, కుదిరెళ్ల బుజ్జి, బెవర జగన్నాథరావు, కామోజుల సీతారాం తదితరులు ఉన్నారు.

కూర్మనాథుడి సన్నిధిలో రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్


టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ రాముడు దంపతులకు ఆశీర్వచనం

గార: శ్రీకూర్మంలో గల కూర్మనాథుడిని బుధవారం రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ వి.రాముడు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఈవో గురునాథరావు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు అందచేశారు.

పండిత సత్కారం

కూర్మనాథుని కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం సదస్యం (పండిత గోష్ఠి) నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ స్వామి జన్మదినం ఉత్సవం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో గురునాథరావు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, అర్చక స్వాములు పాల్గొన్నారు.

వెంకన్నకు ఉయ్యాల సేవ


ఉయ్యాలసేవలో వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి ఉయ్యాల సేవ చేపట్టారు. విశేష ఆరాధన, సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురువారం పుష్పకవచ దర్శనం, పుష్పయాగ మహోత్సవం చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నరసింహ స్వామికి పూజలు


బొరివంకలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: మండలంలోని కవిటి, బొరివంక, మాణిక్యపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లో నరసింహస్వామి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బొరివంక గ్రామంలో రామలింగేశ్వర ఆలయం సమీపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలను నిర్వహించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కవిటిలో నరసింహస్వామి ఆలయం వద్ద 24గంటలపాటు హరేరామ, హరేకృష్ణ నామసంకీర్తన చేపట్టారు.

ఎస్పీకి అభినందన



ఎస్పీని అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల శాంతియుతంగా నిర్వహించడంతో పాటు ఓటింగ్ శాతాన్ని పెంచేలా చొరవ చూపినందుకు ఎస్పీ రాధికను లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు సత్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చాంబర్‌లో లయన్స్ ప్రతినిధులు రాధికను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. క్లబ్ సభ్యులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ఎం స్కూల్లో సీటు ఓ వరం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

అరసవల్లి: గుజరాతీపేటలో గల ఏవీఎన్ మున్సిపల్ హైస్కూల్ సీటు పొందడం ఓ వరం వంటిదని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. ఈ మేరకు బుధవారం డీఈవో వెంకటేశ్వరావు, సమగ్రశిక్ష, ఇతర అధికారుల బృందంతో కలిసి ఆమె పొందరవీధిలో ఇంటింటికీ వెళ్లి ఈ పాఠశాల ప్రత్యేకతలను వివరిస్తూ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇటీవల సమగ్రశిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాస్ శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటలో గల ఏవీఎన్ఎం హైస్కూల్ ను సందర్శించారు. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలను నర్సరీ నుంచి ప్లస్-2 వరకు ఒకే క్యాంపస్‌లో ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలు గల విద్యాసంస్థగా తీర్చిదిద్దాలని ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఈ ప్రాంతవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాల పీఎంశ్రీ పథకంలో ఎంపిక కావడం వల్ల విద్యాబోధనతో పాటు విద్యార్థి సమగ్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా క్రీడలు, ఇతర రంగాల్లో కూడా సమాన ప్రాతినిధ్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విజయకుమారి, అకడమిక్ మోనటరింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి, సెక్టోరల్ అధికారులు, ఎంఈవో కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన ఏదీ?

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలోని కొన్ని వార్డుల సచివాలయ ఉద్యోగుల పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం డబ్బూరివీధిలో గల 7వ వార్డు సచివాలయంలో సిబ్బంది విధులకు పిల్లలతో వచ్చి సెల్ ఫోన్‌లో ఆడుకొంటుండగా, 8వ వార్డు సచివాలయంలో మధ్యాహ్నం 12 గంటలైనా తలుపులు తీయని పరిస్థితి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాల్టీ పరిధిలో 10 సచివాలయాలు ఉండగా, అందులో సగం సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకొనేందుకు సచివాలయానికి వెళ్లినా సిబ్బంది లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను వివరణ కోరగా.. సమాచారం ఇవ్వకుండా విధులకు దుమ్మాకొడితే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ముత్యాలమ్మ తల్లికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో కాకివీధిలో ఉన్న ముత్యాలమ్మ తల్లి పండుగలు సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు.

కామేశ్వరమ్మ పండగ ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో ఉన్న కామేశ్వరమ్మ అమ్మవారి పండగ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన అసిరితల్లి పండగ

జి.సిగడాం: నడిమివలస పంచాయతీ గడబపాలెం మూడు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవత అసిరితల్లి పండగ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ మధుసూధనరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: గొల్లబంజరు గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై బుధవారం దాడులు చేసి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు పాతపట్నం సీఐ నల్లి సాయి తెలిపారు. దీంతో పాటు 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో మెళియాపుట్టి, పాతపట్నం ఎస్ఐలు టి.రాజేష్, మహ్మద్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

హీరో ఆశిష్‌రెడ్డి పేరిట పూజలు

అరసవిల్లి: ఎస్వీసీ బ్యానర్‌పై దిల్‌రాజు, శిరీష్ ప్రొడక్షన్‌లో తెరకెక్కిన లవ్ మీ చిత్రం ఈ నెల 25న విడుదల సందర్భంగా బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హీరో ఆశిష్ రెడ్డి పేరిట పూజలు చేశారు. స్థానిక ఎస్వీసీ థియేటర్ మేనేజర్ బి.రవికుమార్ ఆ సినిమా తొలి పోస్టర్‌ను ఆదిత్యుని పాదాల చెంత ఉంచి పూజలు చేయించారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ చూసి ఆదరించాలని కోరారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్


ఇచ్ఛాపురం: బాలకృష్ణాపురంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు


గార: సెగిడిపేటలో పోలీసులు తనిఖీలు

ఇచ్ఛాపురం: బాలకృష్ణాపురం గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎటువంటి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వానాలను సీజ్ చేశారు. వచ్చే నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఇచ్ఛాపురం రూరల్, కవిటి ఎస్ఐలు లక్ష్మణ్, రాములు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో పోలీస సిబ్బంది పాల్గొన్నారు.

సెగిడిపేటలో..

గార: శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేటలో బుధవారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలోని పశువులు, శాలలు, గడ్డి కుప్పలు తదితర చోట్ల తనిఖీలు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? లేదా అనే విషయంపై గ్రామంలో ఆరా తీశారు.